# ఈ అగ్నిని ఆర్పగలరా!

— టి.ఎస్. హరగోపాల్

రైలు కదలటానికి సిద్ధంగా వుంది. రెండో గంట కొట్టారు. గార్డు పచ్చ జెండా చూపాడు. నా మనసంతా శూన్యంగా వుంది. కంటి వెంట నీళ్లు ఆపుకోలేకపోతున్నా.

"మనసు పాడు చేసుకోకు. రెండు మూడు నెలలు హాపీగా గడుపు, యివన్నీ మరచిపోయి. ఈలోగా అన్నయ్య ఏదో ఉద్యోగం చూస్తాడు. లేకపోతే ఎం.టెక్. చేద్దువుగానీ ... ఎవరి కర్మకు ఎవరూ బాధ్యులు కారు ... జీవితంలో ఎంతో పైకి రావలసిన వాడివి, ఇంత చిన్న, చిన్న విషయాలు పట్టించుకోకూడదు ... ధైర్యంగా వుండు ... లెటర్స్ వ్రాస్తూ వుండు ..." రైలు వెంటే నడుస్తూ, నాన్న ఏవేవో చెబుతూనే వున్నాడు.

అసంకల్పితంగా చేయి వూపుతున్నా.

చెట్లు, చేమలు, పచ్చని పొలాలు, నిండు చెరువు, కాలువ వంతెన, పాలెంకి వెళ్లే దారి ... వెనక్కి వెళ్లి పోతున్నాయి.

పాలెంకి వెళ్లేదారి.

అటు తిరిగి చూశా.

దూరంగా ఆ రెండు తాటి చెట్లు.

జడలు విరబోసుకున్న రాక్షసుల్లా వున్నాయి.

నా ప్రసాద్‌ని పొట్టన పెట్టుకున్న చెట్లు.

మానవుడిలోని రాక్షసత్వానికి ప్రతీకాలుగా చరిత్రలో నిలిచిపోయే చెట్లు.

చెట్లు కనుమరుగవుతున్నాయి.

ఆ దృశ్యం కనుమరుగవటం లేదు.

ఎలా మరచిపోవటం?

"రవీ! రవీ... రా రవీ ... ప్రసాద్‌ని చంపేస్తున్నారు ... కాపాడు రవీ..." లావణ్య అరుపులు చెవుల్లో గింగిర్లెత్తున్నాయి.

ఏం చేయగలిగా!

నిస్సహాయంగా వుండిపోయా. పిరికిపందలా పారిపోతున్నా.

ప్రసాద్!

ఎంత చక్కగా పాడేవాడు!

"ఖుషీ ఖుషీగా నవ్వుతూ
చలాకీ మాటలు రువ్వుతూ
హుషారుగా వుందాములే
నిషా కనులదానా!"

స్కూలులో బల్ల మీద దరువు వేస్తూ, పాడుతూ వుంటే పక్కన నోరు తెరచుకుని వింటూ వుండేవాడిని.

ప్రసాద్ అంటే నాకెంత ఆరాధనో, ప్రసాద్‌కి నేనంటే అంత యిష్టం.

రెండేళ్లు చిన్నవాడ్ని. కాని, నా దగ్గర ఎంతో పెద్దరికం చూపేవాడు.

పన్నెండో తరగతి చదువుతున్నాం.

"రవీ! రేపు బందరులో 'పెళ్లికాని పిల్లలు' సిన్మాకి వెళ్దాం రా" అన్నాడొకరోజు ప్రసాద్.

అమ్మ, నాన్న నడిగా.

అమ్మ ససేమిరా ఒప్పుకోలా, పారుగూరు, చిన్న పిల్లాడు స్నేహితులతో సినిమా లేమిటని. గొడవ గొడవ చేశా. ఆ రాత్రి అన్నం తినలా. నాన్న, "పోనీ, వెళ్లనివ్వు" అన్నాడు. అమ్మ కరిగింది.

ప్రసాద్, నేనూ అందరం కలిసి బందరు వెళ్లాం.

హాలులో కూర్చున్నాం.

ముందు వరసలో మా క్లాసులో అమ్మాయిలు ఐదుగురూ వున్నారు.

నేను ఆశ్చర్యంగా "మన క్లాసమ్మాయిలు కూడా వచ్చార్రా" అని అరిచా.

"ష్, అరవకు. వాళ్లు వచ్చారు కాబట్టే, మనమూ వచ్చాం" అన్నాడు ప్రసాద్.

ఆ లాజిక్ ఏమిటో అర్థమవలా.

సినిమా మొదలయింది. సరదాగా వుంది. ఎప్పుడూ అమ్మ, నాన్న, అక్కయ్య, బావలతోనే సిన్మా చూడటం అలవాటు. స్నేహితులతో సిన్మా చూడటం థ్రిల్‌గా వుంది.

ఇంటర్వెల్.

"లావణ్య లేదే, ఏదీ?" నిర్మల అరిచింది.

సుబ్బలక్ష్మి వెనక్కి తిరిగి "ప్రసాద్ కూడా లేడే" అంది.

"ఇంకేం! ఇద్దరూ జారుకున్నారు" స్వరూపరాణి నవ్వుతూ అంది.

నాకంతా అయోమయం. ప్రసాద్ నన్నొదిలి ఎక్కడికి వెళ్లాడాని భయం.

మిగిలిన స్నేహితులతో బయటకు వచ్చి, కాఫీ తాగాం.

సినిమా అయేటప్పటికి లావణ్య, ప్రసాద్ వాళ్ల సీట్లలో వున్నారు.

"ఎక్కడికెళ్లావురా?"

"నీ కర్థమవదులే" నవ్వుతూ అన్నాడు ప్రసాద్ నాతో. అందరూ నవ్వారు. నేను బిక్క మొగం వేశా.

వచ్చేటప్పుడు అమ్మాయిలు కూడా మాతోనే కలిసి వచ్చారు.

ప్రసాద్, లావణ్య ఏవేవో కబుర్లు, యితరులతో సంబంధం లేకుండా.

మరునాడు లావణ్య, ప్రసాద్ సినిమా మధ్యలో ఎక్కడికో వెళ్లారని ఒక వార్తలా చెప్పుకున్నారు.

నాకు కొద్ది కొద్దిగా అర్థమవుతోంది.

లావణ్యలో అందం కనిపించింది.

ఆ రెండు జడల్లో పొగరుమోత్తనం.

ప్రసాద్ పాట పాడుతున్నప్పుడు ఆమె కళ్లల్లో వెలుగు. వాళ్లిద్దరూకళ్లతోనే మాటలు.

ఇంతకాలం తెలీని ప్రపంచం. రోజూ చూస్తున్న వాటికే కొత్త అర్థాలు.

రెండు రోజులు గడిచాయి.

రెండో రోజు సాయంత్రం స్కూలు నుంచి వచ్చిన సావు గంటకల్లా ప్రసాద్‌ని ఎం.ఎల్.ఎ. అంటీ కొడ్తోందని పరుగు పరుగు తీసుకుంటూ వెళ్లా.

ఎం.ఎల్.ఎ. ఆంటీ మా వూళ్లో ఎం.ఎల్.ఎ.గా నిలబడి ఓడిపోయింది.

ప్రసాద్‌ని కొబ్బరి చెట్టుకి కట్టేశారు.

ఎం.ఎల్.ఎ. ఆంటీ ఎదురుగా కుర్చీలో కూర్చుని వుంది.

"ఏరా, పెద్దింటి అమ్మాయి కావలసి వచ్చిందా? చెప్పులు కుట్టుకోవలసిన వాడివి, చదువుకుంటే ఏమవుతుంది? ఈ వయసులోనే సినిమాలు, షికార్లా?" ఆవిడ లేచి, చెప్పు తీసుకుని ప్రసాద్ చెంప మీద కొట్టింది.

"పోనివ్వవే, కుర్రకుంక, వదిలెయ్" ఆవిడ భర్త అర్థించాడు.

"వదిలెయ్యాలా, వీడినిలా వదిలేస్తే, ఊరంతా పాడవుతుంది" ఆవిడ ప్రసాద్‌ని కాలితో తన్నింది.

ఆమె భర్త, మిగిలినవాళ్లు అడ్డం వచ్చి, ప్రసాద్ కట్లు విప్పారు.

ప్రసాద్ ఏడుస్తూ బయటకు వచ్చాడు.

నేనూ బయటకు వచ్చా. స్నేహితులందరూ చుట్టుముట్టారు. ప్రసాద్ వాళ్ల పాలెం వైపు వెళ్లిపోయాడు.

మరునాడు ప్రసాద్ రాలేదు, లావణ్యా రాలేదు.

క్లాసంతా నిశ్శబ్దంగా వుంది. ఎవరిలో ఉత్సాహం లేదు.

లావణ్య వాళ్ల ఇల్లు మాకు దగ్గరే. లావణ్య మాకు దూరపు చుట్టం కూడా. సాయంత్రం వాళ్లింటికి వెళ్లా. రోజంతా ఏడ్చినట్టుగా వుంది; కళ్లు ఉబ్బి వున్నాయి. రెండు జడలు వేసుకోలా. జుట్టంతా చింపిరిగా వుంది. నన్ను చూసి మళ్లా ఓ మారు ఏడ్చింది. ఆ ఇంటి వాతావరణం చూస్తే ప్రసాద్‌ని లావణ్య వాళ్ల అమ్మ, నాన్న వాళ్లే కొట్టించారేమోననిపించింది.

ఆదివారం ప్రసాద్ వాళ్లింటికి వెళ్లా. నిర్లిప్తంగా వున్నాడు. నాతో ఎంతో సరదాగా వుండే స్నేహితుడు అలా వుంటే ఏడుపొచ్చేసింది.

"ఊరుకో బాబూ, పెద్దింటి బిడ్డవి. నీకెందుకు మా మీద జాలి? నువ్వు వచ్చావని తెలిస్తే, మా వాడ్ని మళ్లా చావబాదుతారు. అందరూ సినిమాకి వెళ్లినా, మా వాడ్ని ఒక్కడ్నే తప్పు పట్టుకున్నారు... ఐనా, ఏం చేస్తాం, మా కర్మ... ఈ కులంలో పుట్టటమే మేము చేసుకున్న పాపం" ప్రసాద్ అమ్మ, నాన్న రోదిస్తూ అన్నారు.

కులాలు... పెద్దకులం, చిన్న కులం... ఊరు వేరు, పాలెం వేరు... ఇవన్నీ నా కిప్పుడిప్పుడే అర్థమవుతున్నాయి.

నాలుగురోజులాగి లావణ్య స్కూలుకి రావటం మొదలెట్టింది. ప్రసాద్ స్కూలు మానేశాడు.

పరీక్షలయ్యాయి. నేను ప్యాసయి, బి.ఇ.లో చేరా. లావణ్య పరీక్ష తప్పింది. ప్రసాద్ పరీక్షకే కూర్చోలా.

కొత్త వూరు, కొత్త స్నేహితులు. పల్లెటూళ్లలో కల్మషాలన్నింటికీ రూపు దిద్దుతాయి పట్టణాలు.

కులాలు, మతాలు, వర్గాలు, ఇజాలు... ఎన్నో... సంపూర్ణ వ్యక్తినయ్యా.

అప్పుడప్పుడూ మా వూరు శలవులకు వచ్చేవాడ్ని.

లావణ్య బందరులో బి.కాం. పూర్తి చేసింది.

ప్రసాద్ ఆర్మీలో చేరాడట. తను వచ్చినప్పుడు నేను వూళ్లో వుండను. వచ్చినప్పుడల్లా మా ఇంటికొచ్చి, నా యోగక్షేమాలు కనుక్కొనేవాడట.

బి.ఇ. పూర్తయింది.

ఊళ్లోనే వున్నా, ఉద్యోగ ప్రయత్నం చేయాలి.

లావణ్యకి సంబంధాలు చూస్తున్నారు.

ఓ రోజు ప్రసాద్ వచ్చాడు, శలవులో వున్నాడట.

వాకిట్లో కూర్చున్నాం. మా అమ్మ, నాన్న ప్రసాద్‌ని దళితునిగా చూడరు; నా స్నేహితుడిగానే గౌరవం ఇస్తారు.

సాయంత్రం ఇద్దరం స్టేషను వైపు వెళ్లాం.



రైలు పట్టాల మీద బాలెన్సు చేస్తూ నడుస్తున్నా.

"లావణ్యని పెళ్లి చేసుకుందామనుకుంటున్నానురా" అన్నాడు ప్రసాద్.

నా బాలెన్సు తప్పింది.

"లావణ్యకి పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఇంకా లావణ్యని మరచిపోలేదా?"

"లావణ్యని ఎలా మరచిపోతా? అంత దూరంలో, సైన్యంలో పని చేస్తూ కూడా ఇంత నిబ్బరంగా వున్నానంటే లావణ్య ప్రేమే"

"లావణ్య నిన్నింకా ప్రేమిస్తోందా, ఎప్పుడో చిన్నప్పటి స్నేహాలు..."

"చిన్నప్పటి స్నేహం ఇప్పటి వరకు ప్రేమగా కొనసాగుతూనే వుంది. తను ఇక్కడ వున్నా, నేను అక్కడ వున్నా ఇద్దరి మనసులు ఒకచోటే వున్నాయి. మా మధ్య ఉత్తరాలు నడుస్తూనే వున్నాయి"

"మరి, లావణ్య నీతో పెళ్లికి సిద్ధమా"

"లావణ్యే శలవు పెట్టి రమ్మంది. రిజిష్టరు మారేజి చేసుకుని, నేను ఉద్యోగం చేసే చోటుకి వెళ్లిపోదామని"

"గొడవలేం కావు కదా!"

"చిన్నప్పుడు కొబ్బరి చెట్టుకు కట్టేసి కొట్టినట్టు కాదు. ఇద్దరం మేజర్లం. ఇష్టమయి, పెళ్లి చేసుకుంటే ఎవరూ, ఏ చట్టం కాదనలేదు. ఇంకా అడ్డం వస్తే, నా రివాల్వర్‌తో కాల్చేస్తా. నాకు హాని చేయబోతే, కాల్చానంటా. కేసు కూడా వుండదు... రవీ, నువ్వు నావైపు పెళ్లి పెద్దగా, సాక్షిగా రావాలి. లావణ్యకి స్వరూపరాణి వెంట వస్తానందట"

అంతా సిద్ధమయ్యాక, నేనుకాదనలేక పోయా. సరేనన్నా.

ప్రసాద్ ధైర్యానికి అభినందించా. లావణ్యలో అంత తెగువ వుంటుందని వూహించలా. నా చేతుల మీదుగా ఒక దళితునితో, ఒక పెద్దింటి అమ్మాయి వివాహం జరిపించగల్గుతున్నానని గర్వపడ్డా. బాపూజీ కన్న కలలు ఫలిస్తున్నాయి.

మరునాడు మేం ముగ్గురం బందరు వెళ్లాం, ఎవరి త్రోవ వారిదిగా. అక్కడికి స్వరూపరాణి, ఆమె భర్త వచ్చారు. సుబ్బలక్ష్మి ఎం.ఏ. చేస్తోందట, వచ్చింది. అందరం చిన్నప్పటి కబుర్లు చెప్పుకున్నాం. ప్రసాద్ పాడిన పాటలు నేను, సుబ్బలక్ష్మి, స్వరూపరాణి చరణాలు, చరణాలుగా పాడాము. ప్రసాద్, లావణ్య ముసిముసిగా నవ్వుకున్నారు.

"రవికి ఆ రోజుల్లో ఏం తెలిసేది కాదు" అంటోంది సుబ్బలక్ష్మి.

"అబ్బో, నీకు ఇప్పటికీ తెలియదు" స్వరూపరాణి ఎత్తిపొడిచింది, సుబ్బలక్ష్మి కింకా పెళ్లి కాలేదని.

రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్లి జరిగింది.

ఫోటోలు తీయించుకున్నాం. స్వరూపరాణి వాళ్లింట్లో భోజనాలు ఏర్పాటు చేసింది.

సాయంత్రం అయింది.

స్వరూపరాణి "ఫస్ట్ నైట్ మా ఇంట్లో" అంది.

"వద్దు, వెళ్లిపోతాం" అన్నాడు ప్రసాద్.

నేను, ప్రసాద్, లావణ్య మా వూరికి బస్సులో వచ్చాం. బస్సు దిగుతూనే, "వుంటాంరా ప్రసాద్" అన్నా.

"నేను ప్రసాద్‌తో వెళ్తున్నా" అంది లావణ్య.

"నువ్వు కూడానా... వద్దు, లావణ్యా, రేపు నెమ్మదిగా విషయం చెప్పి, వెళ్లవుగాని" అన్నా.

"లేదు, పెళ్లయిం తర్వాత ఆ యింటితో సంబంధం ఏమిటి? నా భర్తతో నేను వెళ్తా, భయమేమిటి? అక్కడేం కాదనరు, ఇక్కడ ఒప్పుకోరు!"

ఎంత ఎదిగిపోయింది లావణ్య!

ఆడపిల్లల్లో వివాహమైన వెంటనే పెద్దరికం వస్తుందంటారు, యిదేనేమో!

సరే నన్నా.

ఇంటి కొచ్చా.

"ఎక్కడ కెళ్లావురా " అడిగింది అమ్మ.

జరిగింది చెప్పా. అమ్మ నోరు నొక్కుకుంది. నాన్న, "సరే వూరుకో, చేసిన నిర్వాకం చాలు" అని కోప్పడ్డాడు. నేనూ వూరుకున్నా, వాదించి ప్రయోజనం లేదని.

## నా కన్నడ్ని పోగొట్టుకున్నా...

మాపానినంత దాకా
పచ్చని పొలాల్లేకుండా,
గొడుగుపట్టే చెట్లులేకుండా, చేనులేకుండా చేసి
ఈ కాంక్రీటు కట్టడా లెవడ్రా కట్టించింది?
ఎవడ్రా నా పచ్చని గుండెనిలా పగల్చేసింది?
ఎవడ్రా నా చేత్తో కొడుక్కి కొరివి పెట్టిస్తున్నది?
మట్టి పిసికి బంగారం చేసే నా కొడుక్కి
పరిస్థితుల పగ్గం కట్టి లాక్కెళ్ళిందెవడ్రా?
నోట్ల తోరణం కట్టి పిలిచి
నోటి ముందు బుక్కని తన్నేసిపోయేలా
మార్చిందెవరు? ఏమార్చిందెవరు? ఎవరు ఎవరు??

*

కన్నా నువ్వు నా తడిగుండెల మీద
అర్థాంతరంగా వదిలివెళ్ళిన నాగలి
తడారిన నా బీడు ఒంటి మీద అలాగే పడుంది...
నువ్వు పదమెత్తుకుని మోటకొట్టిన బావి మీద
ఏతాము కొయ్యా, రేకు బొక్కెనా,
నీ కోసం బిక్కుబిక్కుమంటూ చూస్తున్నాయి
బీడులు బీటలైన ఈ గుండె మీద
ఇలా ఒక్కొక్క జ్ఞాపకాల పర్వతాన్ని మోసేదెలారా చిన్నా!

*

పచ్చిగడ్డి లేకుండా, పరిగె లేకుండా,
ఎదుగూ బొదుగూ లేని ఉద్ధారకం చేస్తూ
నా నిటువెల్లా బూడిద కుప్పల మయం చేసి
నన్ను ఎందుకూ పనికిరాని గొడ్డుమోతుని చేసి,
ఎందుకురా కాలవల్తిన్ని కన్నిస్తారు
కాడిపట్టే కొడుకుని కాకుల్లా తన్నుకెళ్ళి
నవుసాన్ని ఎటూమటం చేసి
పారకం పెట్టి ఎందుకురా పరిహసిస్తారు
నా గుండెల మీద గుప్పెడు మొలకల్లేసి
నన్ను అన్నం చేసి అందరికీ పెట్టే

నా కన్నడ్ని పోగొట్టుకున్నాను.
నేను నా కళ్ళని పోగొట్టుకున్నాను.
వాడి చేతుల్లో వన్నెలు పోయేదాన్ని.
వాడి నీడిలో పులకించిపోయేదాన్ని.
వాడి అడుగడుగుని బంతిపూలేసి
కొప్పునెట్టుకునేదాన్ని
ఈ రాట మీదా మోట మీదా
పరవళ్ళు తొక్కే నీళ్ళల్లో
తడిసి ముద్దయ్యేదాన్ని.
నన్ను ఛిన్న కాయం కంటే
పదిలంగా చూసుకునే
కంచెలాంటి కన్నడ్ని పోగొట్టుకున్నాను.
మంచె మీంచి వడిసెల వడిగా విసిరే
నా వీరకన్నడ్ని పోగొట్టుకున్నాను...
రోడ్లన్నీ తిరిగి బొగ్గు బాయిల్లిదిరిగి
కార్ఖానాల్దిరిగి అలసిపోయూ
నా కన్నడ్ని చూశారా? చూస్తే చెప్పండి
ఒక్కసారి వాళ్ళమ్మని చూసిపొమ్మని.
ఆ యంత్రాల పళ్ళ కింద
ఎంతగా నలుగుతున్నాడో బిడ్డ
ఈ గుండెల్లో సలపరం తట్టుకోలేక
రెప్పలు కాచేలా చూస్తున్నాని
నా కన్నడికి చెప్పండి.

*

కడ ఊపిరి దాకా వాడి కోసం
అంకురాన్నై పులకించలేయాలనుంది..
వాడి కోసం గుక్కెడు గంజి కావాలనుంది.
వాడి చెర్నాకోల ముల్లునవ్వాలనుంది
గూడెంలో గువ్వనవ్వాలనుంది.
వాడి ప్రాణంలో ప్రాణమవ్వాలనుంది...

—వరఖుల శివకుమార్

మగతనిద్ర పట్టబోతుండగా హాహాకారాలు.

"పాలెం తగలబడిపోతోంది".

"కొట్టు కుంటున్నారు"

"పాలెంలో అందరినీ చంపేస్తున్నారు"

కంగారుగా లేచా.

"నువ్వు పడుకో, ఆ గొడవల్లోకి పోకు", మా అమ్మ, నాన్న కసిరారు.

విషయం అర్థమవటంలా.

అమ్మ, నాన్న చెప్పరు.

అంతా అయోమయంగా వుంది.

లావణ్య పరుగు, పరుగున వచ్చింది.

"రవీ, రవీ... రా, రవీ... ప్రసాద్‌ని చంపేస్తున్నారు. కాపాడు రవీ... " లావణ్య హిస్టీరికల్‌గా అరుస్తోంది.

"ఏమయింది లావణ్యా?"

"మా యిద్దరి పెళ్ళి అందరికీ తెలిసిపోయింది. కోపంతో మా వాళ్ళు, వూరి పెద్దలు పాలెం మీద పడ్డారు. కనపడ్డ వాణ్ని కనపడినట్లు నరికేస్తున్నారు. కొంపలన్నీ తగలెట్టారు. ప్రసాద్‌ని లాక్కెళ్తున్నారు".

"ప్రసాద్ రివాల్వర్‌తో కాల్చేయక పోయాడా, తర్వాత చూసుకునే వాళ్ళం" నా లోనూ ఆవేశం వచ్చింది.

"రివాల్వర్ తీశాడు. వెనక నుంచి ఎవరో చేతి మీద కొట్టి, రివాల్వర్ పడేసి, లాక్కున్నారు"

"నడు, వెళ్దాం" అంటూ లేచా.

"ఎక్కడికిరా, ఆ గొడవల్లోకి నువ్వెందుకు... అమ్మా, లావణ్యా, ఫో, వాణ్ని ఆ రొంపిలోకి లాగకు. .." మా అమ్మ, నాన్న మీద విపరీతమైన కోపం వచ్చింది.

ఒక పక్క వూరంతా తగలడ్తుంటే, మనుషుల్ని మనుషులు చంపుకుంటూ వుంటే, సాటి మనిషయి చూస్తూ ఎలా వూరుకోగలం!

నేను, లావణ్య పరుగు పరుగున వెళ్లాం.

పాలెం అంతా మంటలు.

చాలా మందికి దెబ్బలు తగిలాయి.

పాలెంలో మగవాళ్లంతా పారిపోయినట్లున్నారు.

ఆడవాళ్ళు, పిల్లలు హాహాకారాలు చేస్తున్నారు. రాక్షసరాజ్యం తాండవం చేస్తోంది.

రెండు తాటి చెట్లకి మధ్య తల్లక్రిందులుగా వ్రేలాడ దీశారు ప్రసాద్‌ని.

ఎవరికి తోచినట్లు వాళ్ళు కొడ్తున్నారు.

లావణ్య పిచ్చెక్కిన దానిలా పరుగు తీసింది.

ఆ అమ్మాయిని బలవంతాన వెనక్కి తోశారు.

"ఆపండి, ఏమిటి యీ దారుణం" అరిచా నేను.

"రేయ్, కరణం గారబ్బాయి నాపండిరా" అన్నారెవరో.

జనాలు నన్ను చుట్టేశారు. ఎంత విదిలించుకున్నా సాధ్యం కాలా.

అదుగో... అప్పుడు.... నేను జీవితంలో చూచిన భయంకర పైశాచిక ఘట్టం.

ప్రసాద్ నెత్తికింద మంట పెట్టారు.

ప్రసాద్ సజీవదహనం అయిపోతున్నాడు.

నేను స్పృహ తప్పి పడిపోయాను.

నన్ను మావాళ్లు యింటికి చేర్చారు. నేను ఆ షాకు నుంచి తట్టుకోలేక పోతున్నా.

"కరణంగారూ, మీ వాడు సాక్ష్యం చెబ్తానంటాడేమో, మీవాణ్ని వూరు నుంచి పంపేయండి" ప్రెసిడెంటు గారు, మున్సబుగారు, ఎం.ఎల్.ఏ. ఆంటీ భర్త, వాళ్ల వచ్చి మా నాన్నతో చెప్పారు.

మా అమ్మ, నాన్న "యీ గొడవల్లో నువ్వెందుకిక్కడ, అన్నయ్య దగ్గరకు పో" అని సమాధానం కోసం ఎదురు చూడకుండా ప్రయాణం ఏర్పాట్లు చేశారు.

బయల్దేరే ముందు లావణ్యని చూడటానికి వెళ్లా. శోక దేవతలా వుంది, ఏడ్చి, ఏడ్చి యింకా ఏడవటానికి మిగిలినట్లు లేదు. నా వైపు వెర్రి చూపు చూసింది. ఉండలేకపోయా.

మరునాడు రైలులో వెళ్తూ, పేపరులో "అగ్రకులాల రాక్షసత్వం— దళిత యువకుని సజీవ దహనం" అని హెడ్డింగు పడింది. పత్రికలైనా స్పందించినందుకు సంతోషించా.

పూనాలో రెండు రోజుల తర్వాత మళ్లీ తెలుగు పేపరు కొంటే, ఆశ్చర్యం. విషయాన్నంతా వక్రించారు- ప్రసాద్‌ది ఆత్మహత్య అని, పోలీసు కేసు నమోదయిందని వ్రాశారు.

నాకింక న్యాయం ఎక్కడుందో తెలియలా.

ఒక దళిత యువకుడ్ని, మిలటరీలో ఉద్యోగం చేసేవాణ్ని, అందరి ముందూ సజీవదహనం చేస్తే, కేసు లేదు.

ఇంక ఈ అగ్రవర్ణాల అహంకారానికి అడ్డు వేసే దెవ్వరు?

ప్రపంచం మొత్తం మీద జాత్యహంకారం.

నల్లవారిపై తెల్లవారి అహంకారం.

మత అహంకారం.

కుల అహంకారం

డాక్టర్ సి. నారాయణరెడ్డిగారు వ్రాసినట్లుగా

"అన్ని జాతుల కొకే సూర్యుడు
అన్ని నేలల కొకే చంద్రుడు
అయినచో జాత్యహంకారము
ఆటవిక తత్వమ్ము కాదా!"

ఎందరు గాంధీలు పుట్టినా, ఎందరు నెల్సన్ మండేలాలు పుట్టినా యీ ఆటవిక తత్వాన్ని మార్చగలరా? ఈ [illegible] ఆర్పగలరా?

## సెలవుల మధ్య బాల్యం

అమ్మయ్య!
ఒక విశ్రాంతి... ఒక నిట్టూర్పు-
ఆకుల మధ్య ఆడుకుంటున్న పువ్వు
పెత్తందార్లై వీధుల కెక్కుతుంది
అల్లరి సుగంధాలు పంచుతూ—
కొమ్మల చాటున వుయ్యాలలూగే పిందె,
పండై పళ్ళికిలిస్తుంది.
వసంతాన్ని వీధుల్లోకి లాక్కు వస్తూ —

యూనీఫారం జైళ్ళ నుండీ,
కాలం కస్టడీ నుండీ,
కంటి చూపు క్రూరపెత్తనం నుండీ
విముక్తమైన బాల్యం,
సీతాకోక చిలుకై చిత్రాలు పోతుంది —
అణుచుకున్న ఆరాటం బంతవుతుంది.
చూపులు గాలిపటాలవుతాయి —
కళ్ళలో కలతలు రేపిన అక్షరాలకు,
పేజీలలోనే సిలువలేసిన రోజులివి —

ముక్కు మీద నుంచి జారిన వేలు
నాన్న వేలిలో చక్కిలిగిలి పెడుతోంది
ఎక్కడికో ప్రయాణమై—

జంతికల కటకటలలో,
సున్ని వుండల పూరింపుల మధ్య,
నాయనమ్మో... అమ్మమ్మో
కథల పూట బాని అవుతుంది.

ఉదయాస్తమయాల
ఉనికి పార బూడిన కాలం,
ఎక్కడో దాక్కుంటుంది —
మళ్ళీ గాలం వెయ్యటానికి!

—ఎం.వి. నాగప్రసాద్